# గణతంత్ర వైభవం..

**అఖండ భారతావనికి రాజ్యాంగం ఏర్పడి 75 ఏండ్లు నిండుకున్నాయి. ఈ వేడుకను ప్రతి యేట జనవరి 26వ తేదీన యావత్ భారతం కనుల పండువగా జరుపుకుంటున్నది. ఈ శుక్రవారం 26వ తేదీతో స్వతంత్ర భారతానికి రాజ్యాంగబద్ధత కల్గి నిండాడైమండ్ జూబ్లీ జరుపుకుంటున్నది. హైదరాబాద్ మహా నగరంలో గణతంత్ర వేడుకలు శుక్రవారం అంబరాన్నంటాయి. ప్రభుత్వ, ప్రభుత్వేతర, ప్రైవేట్ కార్యాలయాలన్నీ రిపబ్లిక్ డే వేడుకల్లో తలమునకలయ్యాయి. ప్రతి వీధి, వాడ, గల్లీలు, బస్తీలు, ఆటో స్టాండ్లు, దుకాణాలు, ప్రతి కూడలి, జన సంచారం గల ప్రతి ప్రాంతం మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. ప్రతి విద్యా సంస్థ ఈ సందర్భంగా ఒక ఉత్సవ వాతావరణాన్ని తలపించింది. భారత్ మాతాకీ జై అంటూ యువత, విద్యార్థులు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. నగరమంతటా జాతీయతా భావం నిండుకొని, నగరవాసి ఒకేతాటిపైకి వచ్చినట్టు అయ్యింది.**



గణతంత్ర వేడుకలో భాగంగా శాసన సభ్యులు, మండలి సభ్యులు అసెంబ్లీ ఆవరణలోని మహాత్మాగాంధీ విగ్రహానికి పెద్ద ఎత్తున నివాళులర్పించారు. శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొన్నం, శ్రీధర్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

## బాధ్యతల్ని సక్రమంగా నిర్వర్తిస్తే దేశ సేవ చేసినట్టే..

### గణతంత్ర దినోత్సవాల్లో జల మండలి ఎండీ సుదర్శన్ రెడ్డి



సిటీబ్యూరో, జనవరి 26(నమస్తే తెలంగాణ): మన బాధ్యతల్ని మనం సక్రమంగా నిర్వర్తిస్తే దేశానికి సేవ చేసినట్టే అని ఎండీ సుదర్శన్ రెడ్డి అన్నారు. జల మండలిలో గణతంత్ర దిన వేడుకలు ఖైరతాబాద్ సంస్థ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఎండీ ముఖ్య అతిథిగా హాజరై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. నీరు అనేది ప్రతి ఒక్కరికి అవసరం అని ఆయన అన్నారు. విధి నిర్వహణలో కొన్ని సవాళ్లు ఎదురైనప్పటికీ వాటిని అధిగమించి ముందుకు వెళ్లాలని సూచించారు. గడిచిన కాలంలో బోర్డుకు ఎన్నో అవార్డులు వచ్చాయని, ఇందులో అధికారులు, ఇంజనీర్ల పాత్ర ఎంతో ఉందని కొనియాడారు. కార్యక్రమంలో డైరెక్టర్లు అజ్మీరా కృష్ణ, శ్రీధర్‌బాబు, వీఎల్ ప్రవీణ్ కుమార్, రవి కుమార్, స్వామి, సీజీఎం, జీఎం పాల్గొన్నారు.

## జీహెచ్ఎంసీలో ..



సిటీబ్యూరో, జనవరి 26(నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా పథకాల అమలులో రాష్ట్రంలో ముందజలో ఉంటామని కమిషనర్ రొనాల్డ్ రోస్ అన్నారు. 75వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్ రెడ్డిలతో కలిసి పోలీసు వందనం స్వీకరించి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలందించిన 43 మంది అధికారులు, సిబ్బందికి మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలతారెడ్డి, కమిషనర్ రొనాల్డ్ రోస్ ప్రశంసా పత్రాలు అందజేశారు.

## కెనరా బ్యాంకులో..



కెనరా బ్యాంకులో గణతంత్ర దిన వేడుకల్లో భాగంగా జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ కె.సత్యనారాయణ రాజు, తదితరులు

సిటీబ్యూరో, జనవరి 26(నమస్తే తెలంగాణ): కెనరా బ్యాంకులో గణతంత్ర దినోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ కె.సత్యనారాయణ రాజు బ్యాంకు అధికారులతో కలిసి జెండావిష్కరణ చేశారు. అనంతరం, ఆయన మాట్లాడుతూ, కర్ణాటకలోని మంగళూరు కేంద్రంగా 1906లో ప్రారంభమైన బ్యాంకు నేడు దేశ వ్యాప్తంగా శాఖలను ఏర్పాటు చేస్తూ ఖాతాదారులకు మెరుగైన సేవలను అందిస్తున్నదన్నారు. మొత్తం 9518 శాఖల ద్వారా 11.19 కోట్ల మంది ఖాతాదారులు, 12118 ఏటీఎంలు ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా వరల్డ్ గ్రాఫింగ్ చాంపియన్‌షిప్‌లో సిల్వర్ మెడల్ సాధించిన ఉమాదేవి దేవరకొండకు ప్రత్యేకంగా సన్మానం చేశారు.



రాష్ట్ర డీజీపీ కార్యాలయంలో త్రివర్ణ పతాకానికి వందన సమర్పణ చేస్తున్న ఏడీజీ మహేశ్ భగవత్, తోటి పోలీసు ఉన్నతాధికారులు



నేషనల్ పోలీసు అకాడమీలో గణతంత్ర వేడుకల్లో డైరెక్టర్ అమిత్ గార్గ్ వందనం



యాంటీ కరప్షన్ బ్యూరో కార్యాలయంలో జాతీయ పతాకానికి సెల్యూట్ చేస్తున్న ఆ శాఖ డీజీ సీవీ ఆనంద్



ఇంటెలిజెన్స్ కార్యాలయంలో జాతీయ పతాకానికి వందనం చేస్తున్న ఏడీజీ శివధర్‌రెడ్డి,



జైళ్ల శాఖలో జాతీయ పతాకానికి సెల్యూట్ చేస్తున్న ఏడీజీ సౌమ్య మిశ్రా

## ఎంకేఆర్ డెవలపర్స్ అవార్డు



హెచ్ఐసీసీ హోటల్‌లో నిర్వహించిన రియాల్టీ అవార్డ్స్ 2024లో బెస్ట్ ఇన్ ఓపెన్ ప్లాట్స్ సేల్స్ ఆఫ్ ది ఇయర్ అవార్డును ఎంకేఆర్ డెవలపర్స్ అధినేత మాదాడి కృష్ణారెడ్డి అందుకున్నారు. సినీ యాక్టర్, రియల్టర్ మురళీమోహన్, బీఆర్ఎస్ సీనియర్ నేత వకుళాభరణం కృష్ణమోహన్ రావు చేతుల మీదుగా ఈ అవార్డును కృష్ణారెడ్డి తీసుకున్నారు. ఈ అవార్డు రావడం పట్ల ఈ సందర్భంగా మాదాడి కృష్ణారెడ్డి సంతోషంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు.

## ఎస్‌బీఐ కార్యాలయంలో



హైదరాబాద్ ఎస్‌బీఐ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో సీజీఎం రాజేష్ కుమార్ పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.



గాంధీభవన్ గణతంత్ర వేడుకల్లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ జాతీయ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలు పాల్గొన్నారు.

## ఏఐజీలో తమ్మినేనిని పరామర్శించిన సీఎం



సిటీబ్యూరో, జనవరి 26(నమస్తే తెలంగాణ): ఏఐజీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. అనారోగ్యంతో బాధపడుతున్న తమ్మినేని ఈ నెల 16న గచ్చిబౌలిలోని ఏఐజీలో చేరిన విషయం తెలిసిందే.

## జోయాలుక్కాస్‌లో బంపర్ ఆఫర్

సిటీబ్యూరో, జనవరి 26 (నమస్తే తెలంగాణ): అంతర్జాతీయంగా పేరొందిన జోయాలుక్కాస్‌లో జువెల్లరీ కొనుగోలులో బంపర్ ఆఫర్‌ను ప్రకటించింది. సంస్థకు సంబంధించిన అన్ని షోరూంలలో మజూరీ ఛార్జీలు (వీఏ)పై ఫ్లాట్ 50 శాతం తగ్గిస్తున్నట్లు సంస్థ ఛైర్మన్ జోయాలుక్కాస్ ఒక ప్రకటనలో తెలిపారు. గోల్డ్, డైమండ్స్, ప్రెషస్ స్టోన్స్, సిల్వర్ సహా విస్తృత శ్రేణి జువెల్లరీపై ఆఫర్ వర్తిస్తున్నదన్నారు. ఈ నెల 25 నుంచి మొదలైన గ్రాండ్ ఆఫర్ వచ్చే నెల 18 వరకు ఉంటున్నదన్నారు. ఈ ఆఫర్‌ను జువెల్లరీ ప్రేమికులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.



అమీర్‌పేటలోని హెచ్ఎండీఏ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఎగరవేస్తున్న ఎంఏయూడీ ప్రిన్సిపల్ సెక్రెటరీ, మెట్రోపాలిటన్ కమిషనర్ దాన కిశోర్, పాల్గొన్న ఉన్నతాధికారులు, ఉద్యోగులు.

*- సిటీబ్యూరో, జనవరి 26(నమస్తే తెలంగాణ)*

## చేనేత కళాకారులకు సహకరిస్తూనే ఉంటాం

### రాష్ట్ర వ్యవసాయ, చేనేత ఉత్పత్తుల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



జ్యోతి ప్రజ్వలన చేసి వస్త్ర ప్రదర్శనను ప్రారంభించిన రాష్ట్ర వ్యవసాయ, చేనేత ఉత్పత్తుల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

వెంగళరావునగర్, జనవరి 26: చేనేత కళాకారులకు ప్రభుత్వ సహకారం ఎప్పటికీ ఉంటుందని, ప్రతి ఒక్కరు చేనేత వస్త్రాలను ధరించి చేనేత కళాకారులకు ప్రోత్సాహాన్ని అందించాలని రాష్ట్ర వ్యవసాయ, చేనేత ఉత్పత్తుల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శ్రీనగర్ కాలనీలోని సత్య సాయి నిగమాగమంలో ఇండియన్ సిల్క్ గ్యాలరీ పేరిట ఏర్పాటు చేసిన చేనేత ఎగ్జిబిషన్‌ను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. చేనేత కళాకారుల ఉత్పత్తులను తిలకించి, సిల్క్ మార్క్‌తో నాణ్యమైన వస్త్రాలను తక్కువ ధరలకే అందిస్తున్న ఇండియన్ సిల్క్ గ్యాలరీ వినియోగదారులకు అందిస్తున్న నిర్వాహకులు శ్రీనివాసరావు కృషిని అభినందించారు. ఇలాంటి వస్త్ర ప్రదర్శనల ద్వారా చేనేతకారులకు చేయూతను, వారి ఉత్పత్తులు నేరుగా వినియోగదారులకు చేరువ అవుతాయని అన్నారు. దేశంలోని ప్రముఖ నగరాలకు చెందిన చేనేత కళాకారులు వారి ఉత్పత్తులను సుమారు 80 స్టాల్స్ లో ఏర్పాటు చేశామని సిల్క్ ఇండియా సీఈఓ వినయ్ తెలిపారు. చెందేరి, ఇక్కత్, నారాయణ పేట్, బెనారస్, కోల్‌కతాకు చెందిన విభిన్నమైన అరుదైన చీరలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో మినిస్ట్రీ ఆఫ్ టెక్స్టైల్స్ ఎన్విరాన్మెంట్స్ డైరెక్టర్ అరుణ్ కుమార్, డాక్టర్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు. ఫిబ్రవరి 3వ తేదీ వరకు ఈ ఎగ్జిబిషన్ వినియోగదారులకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.

## కలెక్టరేట్‌లో ఘనంగా గణతంత్ర దినోత్సవం

సిటీబ్యూరో, జనవరి 26(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో శుక్రవారం గణతంత్ర దిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి జాతీయ పతాకాన్ని ఆవిష్కంచారు. ఈ సందర్భంగా జిల్లాలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, సాధించిన ప్రగతిని వివరించారు. అనంతరం మధురానగర్‌లోని శిశు విహార్ చిన్నారులు, వివిధ విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరింపజేశాయి. ఉత్తమ సేవలందించిన జిల్లా అధికారులు, ఉద్యోగులకు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ప్రశంసా ప్రత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మధుసూదన్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి, విద్యార్థులు పాల్గొన్నారు.





కలెక్టరేట్‌లో త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్, (పక్క ఫొటో) ఉత్తమ సేవలందించిన పోలీసు అధికారులకు ప్రశంసా పత్రాల పంపిణీ

## సమగ్ర అభివృద్ధి, మెరుగైన సేవలే ప్రభుత్వ లక్ష్యం

- జిల్లాలో ఘనంగా గణతంత్ర దిన వేడుకలు
- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ గౌతమ్

మేడ్చల్, జనవరి 26(నమస్తే తెలంగాణ): సమగ్ర అభివృద్ధి, మెరుగైన సేవలే ప్రభుత్వ లక్ష్యం అని మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ పోట్రు అన్నారు. జిల్లా కలెక్టరేట్ ఆవరణలో శుక్రవారం భారత గణతంత్ర దిన వేడుకలు ఘనంగా జరిగాయి. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ గౌతమ్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి నాలుగు నెలలకోసారి ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించి ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు అభయ హస్తం పథకంలో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తుందన్నారు. డిసెంబర్ 28 నుంచి జనవరి 6 వరకు జరిగిన ప్రజాపాలన కార్యక్రమంలో మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు యువ వికాసం వివిధ పథకాలకు ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను స్వీకరించి కంప్యూటరీకరణ చేసి పథకాల వారీగా వివరాలు ప్రభుత్వానికి సమర్పించడం జరిగిందన్నారు. ఆరు గ్యారెంటీలలో భాగంగా మహాలక్ష్మి పథకం కింద బాలికలు, మహిళలు, ట్రాన్స్ జెండర్స్‌కు ప్రభుత్వం కల్పించిన ఉచిత బస్సు సౌకర్యంలో ఇప్పటి వరకు కోటి 20 లక్షల మంది జిల్లాలో ప్రయాణించినట్లు వెల్లడించారు. జిల్లాలో టీఎస్–ఐపాస్ 2014 చట్టం కింద జిల్లాలో ఇప్పటి వరకు 6 వేల 277 ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు వివిధ శాఖల నుంచి 10 వేల 793 అనుమతులు ఇప్పించినట్లు కలెక్టర్ గౌతమ్ పేర్కొన్నారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాను అన్ని రంగాల్లో మరింత ముందుకు తీసుకవెళ్లాలని ఆ దిశగా జిల్లా అధికారులు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా స్వాతంత్ర సమర యోధులను కలెక్టర్ గౌతమ్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మేడ్చల్–మల్కాజిగిరి డీసీపీ నిఖితా పంత్, జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారిణి హరిప్రియ తదితరులు పాల్గొన్నారు. విధులలో ప్రతిభ కనబర్చిన 117 మంది ఉద్యోగులకు కలెక్టర్ ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.



గణతంత్ర దినోత్సవం సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

## దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలో...



ఖైరతాబాద్ మింట్ కాంపౌండ్‌లో టీఎస్ఎస్‌పీడీసీఎల్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ పాల్గొని జాతీయ జెండాను ఎగరవేశారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు టి.శ్రీనివాస్, జె.శ్రీనివాస్ రెడ్డి, కె.రాములు, జి.పర్వతం, సీహెచ్ మదన్ మోహన్ రావు, ఎస్.స్వామి రెడ్డి, జి.గోపాల్, సీవీఓ శ్యామ్‌బాబు, చీఫ్ జనరల్ మేనేజర్లు, సూపరింటెండింగ్ ఇంజనీర్లు ఇతర అధికారులు పాల్గొన్నారు. *- సిటీబ్యూరో, జనవరి 26(నమస్తే తెలంగాణ)*

## దక్షిణ మధ్య రైల్వేకు అత్యుత్తమ ఆదాయాలు

### జీఎం అరుణ్ కుమార్ జైన్

సిటీబ్యూరో, జనవరి 26(నమస్తే తెలంగాణ): దేశంలోని దక్షిణ మధ్య రైల్వే విభాగం గతేడాది అత్యుత్తమ ఆదాయాలను నమోదు చేసిందని జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ పేర్కొన్నారు. 75వ గణతంత్ర దిన వేడుకలను సికింద్రాబాద్‌లోని రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రాంగణంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఇందుకు జీఎం అరుణ్ కుమార్ జైన్ ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించి, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్‌కు చెందిన వివిధ బృందాలు అందించిన గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, గత ఏడాది వార్షిక సంవత్సరమైన ఏప్రిల్–డిసెంబర్ మధ్య కాలంలో సంస్థ అత్యుత్తమ ఆదాయాల్ని పొందినదన్నారు. ఏప్రిల్–డిసెంబర్ –2023లో స్థూల ఆదాయంలో రూ.14,738 కోట్లు సంపాదించినదని, ఇది అంతకు ముందు ఏడాది కంటే రూ.950 కోట్లు అధికమన్నారు. జోన్ సరుకు రవాణాలో 100 మిలియన్ టన్నులను రవాణా చేయడం ద్వారా రూ.10 వేల కోట్ల ఆదాయాన్ని తక్కువ వ్యవధిలోనే అధిగమించి చరిత్ర నెలకొల్పినదన్నారు. ఏప్రిల్–డిసెంబర్ –2023 మధ్య కాలంలో 200 మిలియన్ల మంది ప్రయాణికులను వివిధ గమ్య స్థానాలకు చేర్చడం ద్వారా రూ.4,286 కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. ఆదాయంతో పాటు మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేకంగా దృష్టి సారించామని, మూల ధన వ్యయంలో రూ.13452 కోట్లు ఏప్రిల్–డిసెంబర్ మధ్య కాలంలో ఖర్చు చేశామని జీఎం తెలిపారు. జోన్ చరిత్రలో ఇది మిగతా ఆర్థిక సంవత్సరాల మొదటి 9 నెలల వ్యవధిలో అత్యధికమని ఆయన వెల్లడించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సంలో జోన్‌లో 11 కి.మీ మేర నూతన రైల్వే లైన్లు, 105 కి.మీ డబుల్ లైన్లు, 90 కి.మీ మేర మూడో లైన్ పనులు ప్రారంభించామన్నారు.

## స్టేట్ ఆఫ్ జాయ్ ఆర్ట్ ఎగ్జిబిషన్



ప్రదర్శనలో ఉంచిన చిత్రాలను తిలకిస్తున్న జయేశ్ రంజన్, డైరెక్టర్ లక్ష్మి తదితరులు

కొండాపూర్, జనవరి 26: సంస్కృతి, సంప్రదాయాలతో పాటు విభిన్న రకాల చిత్రాలు, ఆకృతులను చిత్రకారులు ఆకట్టుకునేలా తీర్చిదిద్దారని తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ అన్నారు. మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీ 20వ వార్షిక వేడుకల్లో భాగంగా 'స్టేట్ ఆఫ్ జాయ్' పేరిట ఏర్పాటు చేసిన ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను ఆయన స్పోర్ట్స్ డైరెక్టర్, ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ డాక్టర్ కే లక్ష్మి, అర్జున అవార్డు గ్రహీత, ఎయిర్ పిస్టల్ షూటర్ ఈశా సింగ్, కళాకారిణి అంజూ పోద్దర్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రదర్శనలో ఉంచిన కళాకృతులు అద్భుతంగా ఉన్నాయన్నారు. సంస్కృతి, సంప్రదాయాలతో పాటు విభిన్న రకాల ఆకృతులను చిత్రకారులు ఆకట్టుకునేలా తీర్చిదిద్దారన్నారు. 125 మంది కళాకారుల కళాకృతులు అందుబాటులో ఉన్నాయని, ఈ నెల 31వ తేదీ వరకు ప్రదర్శన కొనసాగుతుందని నిర్వహకులు తెలిపారు.







**ఆనందోత్సవ్** శ్రీనాథ్ జీ ధ్వజాజీ ఆరోహణ్ ఉత్సవ్ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి నెక్లెస్ రోడ్‌లోని జల విహార్‌లో ఏర్పాటు చేసిన ఆనంద్ ఉత్సవ్ ఓ పండుగగా సాగింది. ఈ సందర్భంగా శ్రీకృష్ణుడికి చప్పన్ బోగ్ (56 వంటకాలు)లను నిర్వాహకులు సమర్పించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు నిర్వాహకులు జ్ఞాపికను అందజేశారు. - ఖైరతాబాద్